RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 | ISSUE: 267 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 22-4-2026 | Pages: 8 | Rs: 2/-
సంపుటి : 17 | సంచిక : 267 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 22-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-

### భారత్‌లో 1/4 వంతు పడిపోయిన

## ఎరువుల ఉత్పత్తి



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దిల్లీ: పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వ్యవసాయ రంగంపైనా పడింది. దేశీయంగా ఎరువుల ఉత్పత్తికి సంబంధించిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. మార్చి నెలలో దేశీయంగా వీటి ఉత్పత్తి దాదాపు నాలుగో వంతు తగ్గిపోయిందని కేంద్రం వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి నుంచి సహజ వాయువు దిగుమతులు తగ్గుముఖం పట్టడంతో ఆ మేర తరువాయి 2లో..



# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం

తమిళనాడులో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీడియా సమావేశం

డీలిమిటేషన్‌పై డీఎంకే,

కాంగ్రెస్ తీరును ఎండగట్టిన చంద్రబాబు

మహిళా రిజర్వేషన్లను అడ్డుకుని

దక్షిణాదికి నష్టం చేశారని ఆవేదన

మాతృభాషను గౌరవిద్దాం..

ఇతర భాషలపై ద్వేషం వద్దని హితవు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.

**రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ తరువాయి 2లో..

## మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు.. ఖర్గే వివరణ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదంలో చిక్కుకున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చెన్నైలో మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో ఆయన క్షమాపణలు చెప్పాలంటూ భాజపా డిమాండ్ చేసింది అన్నాడీఎంకే-భాజపా పొత్తును ప్రశ్నించిన ఖర్గే.. ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందన్నారు. ఆయనకు, భాజపాకు సమానత్వంపై విశ్వాసం లేదన్నారు. కాంగ్రెస్-డీఎంకే నేతృత్వంలోని కూటమిని మళ్లీ గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మోదీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈ అవమానకర వ్యాఖ్యలపై ఖర్గే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. తాను తరువాయి 2లో..

## అంబటి రాంబాబుపై మరో కేసు నమోదు

*అంబటిపై కేసు నమోదు చేసిన నగరంపాలెం పోలీసులు*

*అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశంలో దీక్ష నిర్వహించారంటూ కేసు*

*ఇప్పటికే రెండు కేసుల్లో 17 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్న అంబటి*



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

వైఎసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. సత్తెనపల్లి లక్కీడ్రా, ముఖ్యమంత్రి చంద్రబాబుపై వ్యాఖ్యల కేసుల నుంచి ఇప్పుడిప్పుడే కొంత రిలాక్స్ అవుతున్న తరువాయి 2లో..

## ఏపీలో 225, తెలంగాణలో 153.. అసెంబ్లీ సీట్లపై తాజా కదలిక

ఏపీ, తెలంగాణలో ప్రత్యేక నియోజకవర్గాల పునర్విభజనపై ఈసీ పరిశీలన


ఆర్టికల్ 170 సవరణ అవసరమని గతంలో స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

జాతీయ డీలిమిటేషన్ బిల్లు రాకపోతేనే ప్రత్యేక పునర్విభజనకు అవకాశం

2026 జనాభా లెక్కల తర్వాతే పెంపు ఉంటుందని గతంలో కేంద్రం వెల్లడి

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రత్యేకంగా ఈ రెండు రాష్ట్రాల్లోనే సీట్లు పెంచే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో విభజన హామీ అయిన సీట్ల పెంపుపై తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తరువాయి 2లో..





## కౌంటింగ్ వరకు.. స్ట్రాంగ్ రూమ్‌లు తెరవొద్దు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కేరళలోని జిల్లా ఎన్నికల అధికారులకు ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓట్ల లెక్కింపు ముందువరకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్‌లను తెరవకూడదని ఆదేశాలు జారీచేసింది. కొయ్‌కోడ్ జిల్లాలోని పెరంబ్ర నియోజకవర్గంలోని ఈవీఎంలను ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచినట్లు ప్రచారం జరిగింది. దీంతోపాటు పాలక్కాడ్‌లోని నెన్మర నియోజకవర్గంలోని మరో స్ట్రాంగ్ రూమ్ తెరిచేందుకు యత్నించారన్న తరువాయి 2లో..



## చైనా నుంచి ఇరాన్‌కు క్షిపణి రసాయనాలు..!

### *అమెరికా సీజ్ చేసిన నౌకలో..*


**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఐక్యరాజ్యసమితిలో యూఎస్ మాజీ రాయబారి, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ సంచలన ఆరోపణలు చేశారు. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ పతాకంతో ప్రయాణిస్తున్న 'తౌస్కా' అనే వాణిజ్య నౌకను ఇటీవల అమెరికా సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ నౌకలో క్షిపణి తయారీలో ఉపయోగించే రసాయనాలు ఉన్నాయని నిక్కీ హేలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఇటీవల హర్మూజ్ జలసంధిలో అమెరికా స్వాధీనం చేసుకొన్న నౌక చైనా నుంచి ఇరాన్‌కు వెళుతుందని నిక్కీ హేలీ పేర్కొన్నారు. క్షిపణి తయారీలో వినియోగించే రసాయనాలను అందులో తరలిస్తున్నట్లు తరువాయి 2లో..

## ఉద్యోగుల స్థానికతపై కొత్త నిబంధనలు అమల్లోకి

*ఇకపై 26 జిల్లాలు.. 6 జోన్‌లు..2 మల్టీ జోన్‌లు*

*గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం*




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలకు సంబంధించి ఇప్పటి వరకు అమల్లో ఉన్న జోన్‌ల విధానాన్ని పునర్వ్యవస్థీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్-2005).. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గెజిట్‌లో నోటిఫై చేసింది. దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్-1975 రద్దయి, కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. రాష్ట్రంలో 26 జిల్లాల ప్రాతిపదికన కొత్త జోన్‌ల విధానాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవలే రెండు కొత్త జిల్లాల్ని ఏర్పాటు చేయడంతో 28 జిల్లాలకు కొత్త గెజిట్ నోటిఫికేషన్ కోసం కేంద్రానికి మళ్లీ ప్రతిపాదన పంపనున్నారు. ఇప్పుడు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. 26 జిల్లాలు, ఆరు జోన్‌లు, రెండు మల్టీ జోన్‌ల స్థాయిలో లోకల్ కేడర్ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పోస్టుల్ని 27 నెలల్లోగా ఈ కేడర్‌లలోకి సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. కొత్త నిబంధనల తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# తమిళ తంబీలు ఫిదా..

ఎన్నికల ప్రచారం కోసం తమిళనాడులో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు అక్కడి ఓటర్లను ఆకట్టుకునేలా మాట్లాడుతున్నారు. ప్రధానంగా బహిరంగ సభల్లో తమిళంలో మాట్లాడుతూ ఓటర్లను ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. తమిళనాడు సరిహద్దుల్లోని చిత్తూరు జిల్లాకు చెందిన చంద్రబాబుకు కొద్దికొద్దిగా తమిళం తెలుసునని అంటున్నారు. దీంతో తన ప్రసంగం మధ్యలో కొన్ని తమిళ పదాలను వాడుతూ ఓటర్లతో కనెక్ట్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. రెండు రోజుల ఎన్నికల ప్రచారం కోసం చంద్రబాబు తమిళనాడులోని ముఖ్యనగరాల్లో పర్యటిస్తున్నారు. సోమవారం కోయంబత్తూరులో అడుపెట్టిన సీఎం.. వరుస కార్యక్రమాలతో బిజీగా గడుపుతున్నారు. ఇక సోమవారం చంద్రబాబు పుట్టిన రోజు కూడా, దీంతో ఓటర్లను ఆకట్టుకునేలా తన ఈ పుట్టన రోజు నాడు తమిళనాడు రావడం సంతోషంగా ఉందని చెప్పేందుకు చంద్రబాబు తమిళ భాషను వాడుకున్నారు. “అనైవరుక్కుం వణక్కం.. (అందరికీ నమస్కారం) ఎన్ అన్బాన తమిళ్ నాడు మక్కళే..” (నా పుట్టిన రోజున తమిళనాడులో ఉన్నాను) అంటూ చంద్రబాబు ప్రసంగం ప్రారంభించారు. అదేవిధంగా మున్నేట్రం వేణ్డుమా.. వేలైవాయుప్ప గళ్ వేణ్డుమా.. అంటూ అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల అంశాలను ప్రస్తావించారు. అప్పడియానాల్ మధ్యతిల్ మోదీజీ ఇరుక్క వేణ్డుం.. మానిలతిల్ అమ్మ ఆట్చి వర వేణ్డుం.. ఇదుక్కు ఎన్డీఏ కూట్టణియై వెట్రి పెర చెయ్యుంగల్” అంటూ కేంద్రంలో ఎన్డీఏ కూటమి తరఫున ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం అవసరమని, రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత పాలనను గుర్తు చేస్తూ అన్నాడీఎంకే అభ్యర్థులను గెలిపించాలని చంద్రబాబు కోరారు. ఇక తన ప్రసంగంలో ఆయన తమిళనాడు అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, యువతకు ఉపాధి అవకాశాలపై ఎక్కువగా మాట్లాడారు. దక్షిణాదిలో అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్ర, రాష్ట్రాల సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. గతంలో కూడా తమిళనాడులో ప్రచారం చేసినప్పటికీ చంద్రబాబు ఇప్పటిలా తమిళంలో పెద్దగా ప్రసంగించలేదని అంటున్నారు. స్థానిక సంస్కృతి, భాష పట్ల గౌరవాన్ని చూపుతూ మాట్లాడటం వల్ల సభకు వచ్చిన ప్రజల్లో సానుకూల స్పందన కలిగిందని అంటున్నారు.

# అంబటి రాంబాబుపై మరో కేసు నమోదు

ఆయనపై మరో కొత్త కేసు నమోదైంది. కేసు వివరాల్లోకి వెళితే... తన ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన గుంటూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షే ఇప్పుడు ఆయనపై మరో కేసు నమోదుకు దారితీసింది. ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశంలో దీక్ష నిర్వహించడమే కాకుండా, తద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలతో నగరంపాలెం పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే సత్తెనపల్లి లక్కీడ్రా ఉదంతం, చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసుల్లో అంబటి రాంబాబు 17 రోజుల పాటు రిమాండ్‌లో ఉండి, బెయిల్‌పై విడుదలయ్యారు. బయటకు వచ్చిన కొన్ని రోజులకే నిరసన దీక్ష పేరిట నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆయనపై మళ్లీ కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొత్త కేసు నమోదు కావడంపై అంబటి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# ఎన్డీయేతోనే తమిళనాడుకు
# పూర్వ వైభవం



బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?” అని చంద్రబాబు ప్రశ్నించారు. “సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి” అని ఆయన స్పష్టం చేశారు.

**తమిళనాడుకు గత వైభవమేదీ?..:** ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. “తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా? జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై-బెంగళూరు-అమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది” అని విమర్శించారు.

**ఇప్పుడు ఏపీని చూడండి**

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. “దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది” అని ఆయన భరోసా ఇచ్చారు.

**భాషా రాజకీయాలు వద్దు**

ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషాపరమైన బేధాలు సృష్టించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. “మాతృభాషను గౌరవించాలి, కానీ ఇతర భాషలపై ద్వేషం వద్దు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. ప్రధాని మోదీ సైతం మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నారు. భాష పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు” అని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి కష్టాలు తీరతాయని, అది ఎన్డీఏతోనే సాధ్యమని తెలిపారు. తిరువళ్లువార్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎందరో మహనీయులు పుట్టిన ఈ గడ్డపై ప్రజలు పురోగామి ఆలోచనలతో ఎన్డీఏకు మద్దతివ్వాలని కోరారు.

# ఉద్యోగుల స్థానికతపై
# కొత్త నిబంధనలు అమల్లోకి

ప్రకారం.. జూనియర్ అసిస్టెంట్, దానికి సమానమైన, దానికంటే తక్కువస్థాయి పోస్టులకు (నాన్ గెజిటెడ్), ఉపాధ్యాయ పోస్టులకు జిల్లా యూనిట్‌గా.. జూనియర్ అసిస్టెంట్ కంటే పైస్థాయి నుంచి సూపరింటెండెంట్ వరకు, ఒకటో స్థాయి గెజిటెడ్ పోస్టులకు జోన్ యూనిట్‌గా.. ఆ పై స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు, వాటికి సమానమైన పోస్టులకు మల్టీ జోన్‌ను లోకల్ ఏరియా/కేడర్ యూనిట్‌గా పరిగణిస్తారు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి పోస్టులుగా ఉన్నవి ఇకపై మల్టీజోన్ పోస్టులుగా మారతాయి. ఆంధ్రప్రదేశ్ సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, ప్రత్యేక కార్యాలయాలు, సంస్థలు, రాష్ట్రస్థాయి కార్యాలయాలు, రాజధాని ప్రాంతంలోని పోలీసు ఉద్యోగాలకు ఈ లోకల్ ఏరియా నిబంధనలు వర్తించవు.

**ఇకపై నేరుగా చేసే నియామకాల్లో 95 శాతం స్థానికులకు**

ప్రస్తుతం జిల్లా స్థాయి నియామకాల్లో 80:20, జోనల్ స్థాయిలో 70:30 నిష్పత్తిలో స్థానిక, స్థానికేతర కోటా అమలు చేస్తున్నారు. ఇకపై నేరుగా చేపట్టే అన్ని స్థాయిల ఉద్యోగ నియామకాల్లో (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) 95% స్థానికులకు, 5% స్థానికేతరులకు కోటా ఉంటుంది. స్థానిక అభ్యర్థులు లేకపోతే 3 సంవత్సరాల వరకు పోస్టుని క్యారీ ఫార్వర్డ్ చేస్తారు. కనీసం ఒక పోస్టునైనా ఓపెన్ కేటగిరీగా ఉంచాలన్న నిబంధన ఉంది.

**కొత్త జోనల్ వ్యవస్థ ఇలా..!**

మల్టీ జోన్-1

జోన్1: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం,విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు

జోన్2: అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలు

జోన్3: పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు


మల్టీ జోన్-2

జోన్4: గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలు

జోన్5: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలు

జోన్6: నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాలు.

# భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 29




భారత రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటైన ఆర్టికల్ 29 దేశంలోని సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రత్యేకించి మైనారిటీ వర్గాల హక్కులను రక్షించడమే లక్ష్యంగా రూపొందించిన ఈ నిబంధన, భారతదేశం వంటి భిన్నత్వంతో కూడిన దేశంలో ప్రజాస్వామ్య విలువలను బలపరుస్తోంది. ఆర్టికల్ 29 ప్రకారం, దేశంలో నివసించే ఏ పౌరుల సమూహమైనా తమ ప్రత్యేకమైన భాష, లిపి లేదా సంస్కృతిని పరిరక్షించుకునే హక్కును కలిగి ఉంటారు. ఇది కేవలం మైనారిటీలకే పరిమితం కాకుండా, ప్రతి వర్గానికీ వర్తించడం విశేషం. ఈ నిబంధన ద్వారా భిన్న సంస్కృతుల పరిరక్షణకు రాజ్యాంగబద్ధమైన భరోసా కల్పించబడింది. అదేవిధంగా, ఆర్టికల్ 29(2) ప్రకారం, ప్రభుత్వ లేదా ప్రభుత్వ సహాయం పొందే విద్యాసంస్థల్లో మతం, జాతి, కులం లేదా భాష ఆధారంగా ఎవరినైనా ప్రవేశం నిరాకరించడం నిషేధించబడింది. దీనివల్ల విద్యా రంగంలో సమానత్వం మరియు వివక్ష రహిత వ్యవస్థకు మార్గం సుగమమైంది.

**కేసులో ఉదాహరణ:**

ఈ అంశంపై ప్రముఖంగా చర్చించబడిన కేసు మద్రాసు రాష్ట్రం చంపకం దొరైరాజన్ ఈ కేసులో కులాల ఆధారంగా విద్యాసంస్థల్లో సీట్లు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 29(2) ప్రకారం విద్యలో వివక్షకు స్థానం లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పు భారత రాజ్యాంగంలో సమాన హక్కుల అమలుకు కీలక మలుపుగా నిలిచింది. మొత్తానికి, ఆర్టికల్ 29 దేశంలోని ప్రతి వర్గానికి తమ సంస్కృతి, భాషను కాపాడుకునే హక్కును కల్పిస్తూ, విద్యలో సమాన అవకాశాలను నిర్ధారించే ముఖ్యమైన రాజ్యాంగ హామీగా నిలుస్తోంది.

జె. కనక దుర్గ లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచార్జి.

## మొదటి పేజీ తరువాయి

# కౌంటింగ్ వరకు.. స్ట్రాంగ్ రూమ్‌లు తెరవొద్దు: ఈసీ

కథనాలు వెలువడ్డాయి. ఇదికాస్తా రాజకీయ దుమారం రేపింది. ఈ క్రమంలోనే కేరళ ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యు కెల్కర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ స్ట్రాంగ్ రూమ్‌లను, సీల్ వేయని గదులను తెరవడం లాంటివి చేయొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, భద్రతను కాపాడేందుకు అధికారులంతా ఈ సూచనలు కచ్చితంగా పాటించాలని కోరారు. కాగా.. కేరళలోని 140 నియోజకవర్గాలకు ఈనెల 9న అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించిన ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

# ఏపీలో 225, తెలంగాణలో 153.. అసెంబ్లీ సీట్లపై తాజా కదలిక

చట్టం-2014 ప్రకారం, ఏపీలో అసెంబ్లీ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. అయితే, 2026 తర్వాత జరిగే తొలి జనాభా గణన అనంతరమే దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది. దీనికితోడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170కి అనుగుణంగా విభజన చట్టంలోని సెక్షన్ 26ను సవరించకుండా సీట్ల పెంపు సాధ్యం కాదని సుప్రీం కోర్టు కూడా గతంలో ఓ తీర్పులో పేర్కొంది. ఈ రాజ్యాంగపరమైన చిక్కుముడి వల్లే ఇన్నాళ్లు ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ కోసం కేంద్రం ఓ కొత్త బిల్లును తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలల్లో ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తెస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ ఆ జాతీయ బిల్లు రావడం ఆలస్యమైతే, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారమే తెలుగు రాష్ట్రాల్లో సీట్లు పెంచేందుకు ఉన్న అవకాశాలను ఈసీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# భారత్‌లో 1/4 వంతు పడిపోయిన ఎరువుల ఉత్పత్తి

ఉత్పత్తిపై ప్రభావం పడింది. ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ దాడి అనంతరం హర్మూజ్ జల సంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఇంధన సరఫరాపై ప్రభావం పడింది. యూరియా వంటి ఎరువుల తయారీకి సహజ వాయువు కీలకం. దిగుమతులు తగ్గుముఖం పట్టడంతో ఎరువుల తయారీ 24.6 శాతం తగ్గినట్టు కేంద్రం సోమవారం వెల్లడించింది. అయితే ఎరువులు తగిన స్థాయిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. అంతకుముందు ఫిబ్రవరి నెలలో 3.4 శాతం, జనవరిలో 3.7 శాతం, డిసెంబర్‌లో 4.1 శాతం ఉత్పత్తి పెరగడం గమనార్హం. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్-జులై నెలల్లో దేశీయంగా ఎరువులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. రబీ సీజన్‌కు సంబంధించి అక్టోబర్-నవంబర్‌లో మళ్లీ డిమాండ్ ఉంటుంది. ఎరువులను దేశీయంగా ఉత్పత్తి చేయడంతో పాటు యూరియా, ముడి పదార్థాలను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరిగిన నేపథ్యంలో ఆ ప్రభావం రైతులపై పడకుండా సబ్సిడీ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం 11 శాతం ఇటీవల పెంచింది.

# మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు.. ఖర్గే వివరణ

ఎప్పుడూ మోదీని ఉగ్రవాది అని అనలేదన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు.

# చైనా నుంచి ఇరాన్‌కు క్షిపణి రసాయనాలు

ఆరోపించారు. నౌకను ఆపాలని యూఎస్ దళాలు అనేకసార్లు హెచ్చరించినా, అది పట్టించుకోలేదన్నారు. దీంతో యుద్ధంలో ఇరాన్‌కు చైనా సైనిక సాయం అందిస్తోందనే విషయాన్ని తోసిపుచ్చలేమని వ్యాఖ్యానించారు.

**నౌకను తక్షణమే విడుదల చేయండి..**

అమెరికా తమ వాణిజ్య నౌకను సీజ్ చేయడంపై ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్రంగా మండిపడింది. నౌకను, అందులోని సిబ్బందిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఇది వెంటనే జరగకపోతే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఓ ప్రకటనలో అమెరికాను హెచ్చరించింది. ఈ ఆపరేషన్‌లో సిబ్బందిని, వారి కుటుంబాలను బెదిరించి అమెరికా దళాలు.. బందీలుగా చేసుకున్నాయని ఆరోపించింది. అంతర్జాతీయ సంస్థలు వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, నౌకను, అందులోని సిబ్బంది క్షేమంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరింది. జాతీయ ప్రయోజనాలను, తమ పౌరుల హక్కులను కాపాడుకొనేందుకు ఇరాన్ అన్ని మార్గాలను వాడుతుందని వెల్లడించింది.

# భూమి దినోత్సవం జయప్రదం చేయండి

## – సమస్త జీవరాశినీ జివించేందుకు కృషి చేయాలి – 27 మొక్కలు ప్రతి ఒక్కరూ నాటి పెంచాలి

## – ప్రకృతి వనరుల పరిరక్షణ మన బాధ్యత – జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 21**

భూమి దినోత్సవం జయప్రదం చేయండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. మంగళవారం ఉదయం మద్దిలపాలెం లో ఉన్న అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యాసంస్థ లో ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన నిర్వహించిన భూమి దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం ఇతివృత్తం "మన శక్తి, మన గ్రహం," అన్నారు. ఇది పర్యావరణ పురోగతి కేవలం ప్రభుత్వాల పరిపాలనల ద్వారానే కాకుండా, వ్యక్తుల రోజువారీ చర్యలు, ఆవిష్కరణలు సామాజిక భాగస్వామ్యం ద్వారా కూడా సాధ్యమవుతుందని నొక్కి చెప్పారు. ఇది పునరుత్పాదక శక్తికి మారడం, స్థానిక చర్యలు తీసుకోవడంపై ఉద్ఘాటిస్తుందన్నారు. సమాజ స్థితిస్థాపకత, స్వచ్ఛ ఇంధన వాదన, మన భూగ్రహాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భాద్యతగా గుర్తెరిగి నడుచుకోవాలి అన్నారు. మన ఇల్లు, మన పని ప్రదేశం, పాఠశాలల్లో తీసుకునే రోజువారీ పర్యావరణ పరిరక్షణ నిర్ణయాలు అన్నీ కలిసి ఒక సుస్థిర భవిష్యత్తును రూపొందిస్తాయని వివరించారు. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సౌర, పవన శక్తి వంటి పునరుత్పాదక వనరుల వైపు మరల వలసి




ఉందన్నారు. సమస్త జీవరాశినీ జివించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని కోరారు. స్కంద పురాణంలో లేదు. వ్యాస మహర్షి చెప్పిన విధంగా 27 మొక్కలు ప్రతి ఒక్కరూ నాటి పెంచాలని పిలుపునిచ్చారు. ప్రకృతి వనరుల పరిరక్షణ మన బాధ్యత అని గుర్తెరిగి వాటిని కాపాడుకోవాలి అని వివరించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ పర్యావరణ సమస్యలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలనే ప్రయత్నంలో, అమెరికా లోని సెనేటర్ గేలార్డ్ నెల్సన్ కార్యకర్త డెనిస్




హేస్‌ను సమన్వయకర్తగా నియమించడంతో, మొదటి భూమి దినోత్సవం 1970 ఏప్రిల్ 22న జరిగిందన్నారు. 1990లో, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, 141 దేశాలలో 20 కోట్ల మంది ప్రజలను స్పందించింది అని వివరించారు. ప్రస్తుతం 190 కి పైగా దేశాల్లో భూమి దినోత్సవం నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ సమన్వయకర్త ఐ కృష్ణ కుమారి, అధ్యాపకురాలు రత్నం తదితరులు పాల్గొని మాట్లాడారు.

## పాడేరు మోదకొండమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గిడ్డి ఈశ్వరి ఏకగ్రీవ ఎన్నిక



**పాడేరు, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 21**

ఆదివాసీల ఆరాధ్య దైవం, ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అయిన శ్రీశ్రీశ్రీ పాడేరు మోద కొండమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పాడేరు మాజీ శాసన సభ్యులు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి గారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్‌లో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ నిశాంతి , ఐటిడిఏ పీఓ ఆదిత్య వర్మ, జాయింట్ కలెక్టర్ పూజ , వర్తక సంఘాల ప్రతినిధులు, ఆదివాసి పెద్దల సమక్షంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించబడింది. ఇందులో గిడ్డి ఈశ్వరి ని ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కలెక్టర్ నిశాంతి, ఐటిడిఏ పీఓ ఆదిత్య వర్మ , జాయింట్ కలెక్టర్ పూజ వర్తక సంఘాలు, ఆదివాసి పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఈ నెల 17, 18, 19 తేదీలలో అమ్మవారి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో, ఉత్సవ కమిటీ, అధికారులు, ఆదివాసి పెద్దలు, ప్రజల భాగస్వామ్యంతో జాతరను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ వార్డు అధ్యక్షుల నియామకం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 21**

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు అధ్యక్షతన విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి వార్డు అధ్యక్షులుగా పలువురికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా 11 వ వార్డుకి చింతగుంట వెంకటేష్, 15 వ వార్డుకి వేముల సురేష్, 21 వ వార్డుకి ఈగల మోహన్ సాయి, 22 వ వార్డుకి డా.జీ పవన్ కుమార్, 27 వ వార్డుకి మామిడి వరాలమ్మ, 28 వ వార్డుకి గుర్రం కనకరావు వార్డు అధ్యక్షులుగా నియమితులైయారు. ప్రియాంక దండి మాట్లాడుతూ కొత్తగా నియమితులైన వార్డు అధ్యక్షులు గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలని, ఈసారి కౌన్సిల్ లో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అడుగు పెట్టి ప్రజా సమస్యల మీద గళమేతలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన పోరాడే వారికి పార్టీ అవకాశం ఇస్తుందని ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మహేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గౌతమ్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు కాండవ గాయత్రి, సీనియర్ నాయకులు కస్తూరి వెంకట్ రావు, భాష, చెన్న అప్పారావు, శ్రీనివాస్, కే విమల, ఈశ్వర్ రావు, త్రినాథ్ రావు.

## గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల విస్తరణకు కలెక్టర్ నిషాంతి శ్రీకారం

**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :21**

జిల్లాలో గ్రామీణ అభివృద్ధిని డిజిటల్ మార్గంలో వేగవంతం చేయడానికి కీలక కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని 11 మండలాలకు చెందిన 583 మంది గ్రామ సంఘాల సహాయకులకు 6 జీబీ ర్యామ్, 128 జీబీ నిల్వ సామర్థ్యం కలిగిన ఆధునిక 5జీ మొబైల్ ఫోన్లను కలెక్టర్ నిషాంతి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది. తక్షణ డేటా నమోదు, నివేదికల సమర్పణ వేగవంతం కావడంతో పాటు, సేవలలో పారదర్శకత మరియు సమర్థత పెరగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవల విస్తరణకు ఇది ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 13,316 స్వయం సహాయక సంఘాలు పనిచేస్తుండగా, 1,52,554 మహిళా సభ్యులు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ మొబైల్ ఫోన్ల ద్వారా గ్రామ సంఘాల సహాయకులు సంఘాల వివరాలు, పొదుపులు, రుణాల సమాచారం, ప్రభుత్వ పథకాల వివరాలను వేగంగా నమోదు చేసి సమర్థంగా నిర్వహించగలరు. ముఖ్యమంత్రి 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. గ్రామీణ అభివృద్ధిలో డిజిటల్ సేవలను బలోపేతం చేసే దిశగా ఇది ఒక కీలక అడుగుగా నిలవనుంది.



# 22న గీతం యూనివర్సిటీ ముట్టడి

## వాసుపల్లి గణేష్ హెచ్చరిక



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 21**

ఈ నెల 22న గీతం యూనివర్సిటీని ముట్టడిస్తామని వైసీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రకటించారు. స్టేట్ యూత్ వింగ్, సౌత్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఆసిల్ మెట్ట కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వ భూముల బదలాయింపు అంశంపై ఇటీవల జివిఎంసీ కౌన్సిల్‌లో తీవ్ర వివాదం చెలరేగిందని ఆయన గుర్తు చేశారు. రుషికొండ, ఎండాడ గ్రామాల్లో గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న సుమారు 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆ సంస్థకు బదలాయించే ప్రతిపాదనకు కూటమి పార్టీల మద్దతుతో ఆమోదం లభించిందని ఆరోపించారు. విశాఖ నగరంలోని విలువైన ప్రభుత్వ భూములను గీతం యూనివర్సిటీకి అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని వాసుపల్లి గణేష్ కుమార్ విమర్శించారు. ఎకరం రూ.100 కోట్ల చొప్పున సుమారు రూ.5,000 కోట్లకు పైగా విలువైన భూములను ధారాదత్తం చేయాలని నిర్ణయించారని తెలిపారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో గీతం యాజమాన్యం ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను కాపాడామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని బంధు ప్రీతితో మళ్లీ అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విశాఖ ఎంపీ భరత్‌కు ఈ భూములను అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో, 22న మధ్యాహ్నం 2 గంటలకు సుమారు 2000 మంది విద్యార్థులతో కలిసి గీతం యూనివర్సిటీని ముట్టడిస్తామని వాసుపల్లి గణేష్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గవర్నర్ అశోక్ గజపతి రాజును కలిసిన ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 21**

విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని కప్పరాడ ఎన్‌జీఓఎస్ కాలనీ 49వ వార్డులో ఉన్న ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఈ నెల 11న ప్రముఖులు సందర్శించారు. ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు ఆహ్వానం మేరకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, అలాగే ఎమ్మెల్యే విజయలక్ష్మి గజపతి రాజు ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు ఆలయ సమీపంలోని సింహాచలం దేవస్థానం భూమిని మంత్రులకు చూపించి, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ కళ్యాణ మండపం మరియు కోనేరు నిర్మించాలని వినతిపత్రం సమర్పించారు. తదనంతరం విజయనగరంలో గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ను మర్యాదపూర్వకంగా కలిసిన విష్ణు కుమార్ రాజు, అదే స్థలంలో కోనేరు మరియు కళ్యాణ మండపం నిర్మాణ అవసరాన్ని వివరించారు. భక్తులకు ఈ నిర్మాణాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. ప్రసాద్, శేషాచార్యుల బృందం వేద ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు. ఆలయంలో కోనేరు, కళ్యాణ మండపం నిర్మాణం అత్యవసరమని ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు పేర్కొన్నారు. ఈ అంశంపై గవర్నర్ అశోక్ గజపతి రాజు సానుకూలంగా స్పందించి, అవసరమైన స్థలం కేటాయించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

# విశాఖ లో 150 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా...?

## వైసీపీ ఆరోపణలు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :21**

కూటమి నాయకుల అండతో విశాఖపట్నంలో సుమారు 150 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ భూకబ్జాపై తక్షణ విచారణ జరిపి, సంబంధిత అధికారులు మరియు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం విశాఖ తూర్పు నియోజకవర్గంలోని జోడుగుళ్లపాలెం ప్రాంతంలో, వైఎస్ఆర్ విగ్రహం ఎదురుగా ఉన్న తుపాన్ బాధితుల భవనం సమీపంలోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు మద్దతుగా విశాఖపట్నం జిల్లా వైసీపీ అధ్యక్షుడు కె.కె. రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ, నగరంలో ఇటీవల భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జోడుగుళ్లపాలెం--కైలాసగిరి సమీపంలో సుమారు 71 నుండి 84 సెంట్ల వరకు విస్తరించిన ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ భూమిలో 2024 సాధారణ ఎన్నికల సందర్భంగా 91, 92, 93 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ, ఇప్పుడు ఆ భూమిని అక్రమంగా హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొంతమంది రాజకీయ నాయకులు, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, స్థానిక ఎమ్మెల్యే మరియు కొందరు రెవెన్యూ అధికారులు కలిసి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నకిలీ పత్రాలు సృష్టించడం, కోర్టు వ్యవహారాల్లో సహకరించడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి హానికరమని అన్నారు. రెవెన్యూ శాఖ, జివిఎంసి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ, అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. జోడుగుళ్లపాలెం భూకబ్జాపై తక్షణ విచారణ జరిపి, సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని, నకిలీ పత్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఆక్రమిత ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ మరియు పోలీస్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను కాపాడటం ప్రతి అధికారికీ బాధ్యత అని, ఈ అంశంపై మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు గళమెత్తాలని పిలుపునిచ్చారు. వైసీపీ తరఫున భూకబ్జాలను అడ్డుకునే వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ స్వాతి, ఉమ్మడి దాస్, పళ్ళ దుర్గ, పేర్ల విజయచంద్ర, అంబటి శైలేష్, ఎం. సునీల్, సనపల రవీంద్ర భరత్, రామన్న పాత్రుడు, ఈశ్వర్, హరికృష్ణ, సాగర్, రీసు అనురాధ, చోళగి నాగేశ్వరరావు, ఉమ్మడి కళ్యాణ్, నీలిరెడ్డి తదితరులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు : సమీక్షించిన కలెక్టర్ విజయ్ కృష్ణన్





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ : 21**

రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెం వద్ద ఈ నెల 23న జరగనున్న సౌర విద్యుత్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి క్షేత్రస్థాయిలో పర్యటించి, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ముందస్తు భద్రతా సమీక్ష నిర్వహించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ముఖ్యమంత్రి కాన్వాయ్ మార్గాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కదలికలను గమనించాలని, భద్రతా విధులకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అధికారుల బృందం హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి అత్యవసర పరిస్థితుల్లో అమలు చేయాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై చర్చించింది. పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన బాధ్యతలు కేటాయించాలని ఐజీ సూచించారు. సమీక్షా సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పలు శాఖల అధికారులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష సమావేశం






**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో మత్స్య, పశుసంవర్ధక, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయా శాఖలలో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు పురోగతిని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో పురోగతిని కనపరచాలన్నారు. ప్రధానంగా జిల్లాలో 119 కిలోమీటర్ల కోస్తా తీర ప్రాంతం ఉందని, 55 మత్స్యకార గ్రామాలు, 23 ఫిష్ లాండింగ్ సెంటర్లు, 4641 బోట్లు, 30 వేల మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. సుమారుగా జిల్లాలో లక్షా 30 వేల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమ నిమిత్తం అమలు పీఎంఎంఎస్వై ఇతర సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో జిల్లాలో అమలయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా మత్స్య శాఖ సంబంధించిన మెరైన్, ఇన్ ల్యాండ్,ఆక్వా కల్చర్ సాగు, కాకినాడ ఎస్ఐఎఫ్టీ ద్వారా ఆక్వా రైతులకు అందిస్తున్న సదుపాయాల వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డీప్ సీ ఫిషింగ్ ప్రమోట్ చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకారుల సహకార సంఘాలను బలోపేతం చేసి వారికి ఆర్థిక పరిపుష్టి కలిగించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి జిల్లాలో ప్రస్తుతం అమలవుతున్న పథకాలపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు నిర్మించిన పశువుల షెడ్ లు, పశు కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణి, ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం సాగు, పశువులకు టీకాలు వంటి వివరాలను జిల్లా కలెక్టర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో 2,331 మందు రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. వేసవి దృష్ట్యా పశువులకు ఎటువంటి తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం వైపు మరింత మంది రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన సమీక్షలో భాగంగా జిల్లాలో 46 వేల మంది రైతులు 43,452 ఎకరాలు విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారన్నారు. మరింతమంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం కింద సాగుచేసిన దేశీయ బియ్యం, ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులు, చిరుధాన్యాలను ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం జే. ఎలియాజరు.. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కు చూపించారు. ఉద్యాన శాఖకు సంబంధించి 2025-26 సంవత్సరంలో జిల్లాలో 34 వేల ఎకరాల్లో ఉన్న ఉద్యాన సాగుకు విస్తీర్ణాన్ని 49 వేలకు పెంచడం జరిగిందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయిల్ ఫామింగ్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఎన్ఎంబీ, ఎంఐడీహెచ్ వంటి పథకాలు నూరు శాతం రైతులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు మరింత అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ అధికారును ఆదేశించారు. 2026-27 కింద ఎంఐడీహెచ్ పథకానికి రూ.3.28 కోట్ల బడ్జెట్ కేటాయించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖకు సంబంధించి జిల్లాలో ప్రస్తుతం 2,164 ఎకరాల్లో మల్బరీ సాగు అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో మల్బరీ తోటలు విస్తీర్ణం పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు, ఎస్ఐఎఫ్టి కాకినాడ ప్రిన్సిపల్ డా.అంజలి, పశుసంవర్ధక శాఖ జేడీ డా.వి. శ్రీధర్, డా.గిరీష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి టీవీ.సెరిల్, పట్టు పరిశ్రమ శాఖ డీడీ బి.గీతారాణి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గంజాయి రవాణా కేసులో ఇద్దరు అరెస్ట్



**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :21**

శ్రీకాకుళం జిల్లా కంచిలి పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం నిర్వహించిన తనిఖీల్లో సబ్ ఇన్స్పెక్టర్ పారి నాయుడు మరియు సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయి మరియు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు రాహుల్ (ఎ-1) ఒడిశా రాష్ట్రానికి చెందిన అవినాష్ (ఎ-2) వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించడానికి ప్రయత్నించాడు. మొత్తం 6.690 కిలోల గంజాయిని మూడు ప్యాకెట్లలో బ్రౌన్ ప్లాస్టర్‌తో చుట్టి, నీలం రంగు బ్యాక్‌ప్యాక్‌లో భద్రపరిచాడు. ఈ గంజాయిని హౌరా మెయిల్ రైలులో చెన్నైకి తరలించేందుకు సోంపేట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సమయంలో, ముందస్తు సమాచారం ఆధారంగా నిఘా ఉంచిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 6.690 కిలోల గంజాయి (3 ప్యాకెట్లు) మరియు 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## డిప్యూటీ సీఎం పవన్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు...





**మలికిపురం సిటిజన్ టైమ్, ఏప్రియల్ 21:**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ, ఇంచార్జి అమూల్యాలు వేరువేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజోలు శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూజలు నిర్వహించగా, మామిడికుదురు శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజోలు ఇంచార్జి గొల్లపల్లి అమూల్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని, ప్రజా సేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ప్రార్థించారు. ఆయన సేవలు ప్రజలకు అవసరమని, మరింత ఉత్సాహంతో ప్రజా సేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డిసి ఆకన బాబ్జీ నాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాస్, ఎం సత్తిబాబు, గుండాబత్తుల తాతాజీ, గుబ్బల రవి కిరణ్, బోణం సాయి, కోళ్ల బాబి, ఉలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్ ఆధునికరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**చింతలపూడి:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్:21:**

చింతలపూడి లోని బస్టాండ్ ఆధునీకరణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సొంగ.రోషన్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు.బస్సు స్టాండ్ లో మరుగుదొడ్లు, భవనాలకు నూతన రంగులతో కొత్త రూపును సంతరించుకునేలా చేయడం వంటివి మరియు నైట్ హాల్ట్ ఉండే డ్రైవర్లకు విశ్రాంతి గదులు,త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా బస్టాండ్‌ను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత చింతలపూడి పట్టణానికి మరింత సౌకర్యవంతమైన రవాణా కేంద్రంగా మారుతుందని ఎమ్మెల్యే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాసేపు బస్టాండ్ లో ఉన్న దుకాణాలలో సాధారణ వ్యక్తిగా కాసేపు అక్కడున్న ప్రయాణికులకు తినుబండారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :21**

జిల్లాలో ముఖ్య వ్యక్తులు మరియు ముప్పు ఉన్న వర్గాలకు భద్రత కల్పించే పోలీసు సిబ్బంది (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు, పి.ఎస్.ఓలు) ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించడం అత్యంత ముఖ్యమని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పి.ఎస్.ఓల కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల పునశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భద్రతా విధుల్లో శారీరక దారుఢ్యం, వృత్తి నైపుణ్యం కీలకమని, వీటి ద్వారా సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా విఐపీ సెక్యూరిటీ విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైరింగ్ ప్రాక్టీస్, బాంబ్ డిస్పోజల్ విధానాలు, అలాగే 'ఏం చేయాలి, ఏం చేయకూడదు' అనే అంశాలపై సమగ్రంగా మార్గనిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సిబ్బంది తమ నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు.



## పెదన పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా ఎమ్మెల్యే

**పెదన :( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ :21:**

పెదన ముసిపల్ పరిధిలోని 23వ వార్డు లో బొడ్డు నాగయ్య జూనియర్ కళాశాల లో సీసీ రోడ్ నిర్మాణానికి పెదన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు.ఎమ్మెల్యేమాట్లాడుతూపెదన జూనియర్ కళాశాల లో అసంపూర్తిగా ఉన్న రోడ్ పూర్తి చెయ్యాలని కాలేజీ సిబ్బంది కోరిన నేపథ్యంలో సుమారు 12.5 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. పట్టణ పరిధిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో పక్కా ప్రణాళిక తో గాడిలో పెడుతున్నామని,మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం మణికంఠ కన్స్ట్రక్షన్స్ సీఈవో నారగం వెంకటరత్నం బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఫర్నిచర్ ను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదగా వితరణగా ఇచ్చారు. కళాశాలలో మౌలిక వసతులు ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని మణికంఠ హామీ ఇచ్చారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థిని సన్మానించారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉపాధ్యాయులను సన్మానించారు. క్రమశిక్షణ కలిగిన విద్యతో, మంచి ప్రతిభావంతులుగా తయారు చేస్తున్నందుకు ప్రభుత్వ కళాశాలకు మంచి పేరు వస్తుందని, అందుకే ప్రభుత్వ కాలేజీలో జాయిన్ అయ్యేందుకు విద్యార్థులు అధిక



సంఖ్యలో వస్తున్నారని కాలేజీ సిబ్బందిని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పెదన పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, మండల విద్యాశాఖ అధికారి నక్క సాలోమి, బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది, కార్యకర్తలు, అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

### ప్రతి నెల మొదటి వారంలో పాస్ పుస్తకాలు గ్రామ సభల ద్వారా పంపిణీ చేయాలి

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**



రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని ?ప్రజలకు జవాబు దారీగా ఉంటూ పారదర్శకతతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి అమరావతి నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి 22 ఏ. భూములు,రి సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ? ముటేషన్లు రెవెన్యూ రిజిస్టరీ పిజిఆర్ఎస్ అంశాల పురోగతిపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రెవెన్యూ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తూ యుద్ధ ప్రాతిపదికన భూ రీ-సర్వే పనులు పూర్తి చేయడంతో పాటుగా రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతి నెల మొదటి వారంలో గ్రామ సభల ద్వారా పంపిణీ చేయాలన్నారు.భూ పరిపాలన, రెవెన్యూ సేవల అందించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని,బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు .22 ఏ, జాబితాలో ఉన్న భూములపై వచ్చే అభ్యర్థనలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.అర్హత ఉన్న భూములను జాబితా నుండి తొలగించే ప్రక్రియలో జాప్యం చేయకుండా, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి వెంటనే ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలన్నారు.కోనసీమ ?జిల్లాలో జరుగుతున్న భూ రీ-సర్వే పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటుగా సర్వే పూర్తయిన గ్రామాల్లో సవరించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు వెంటనే అందజేయాలన్నారు. భావితరాలకు వివాద రహిత భూముల హక్కుపత్రాలను అందించాలన్నారు ఏ ఒక్క రైతు కూడా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం రాకూడదని,ప్రతి నెల మొదటి వారంలో గ్రామ సభల ద్వారానే పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాంకేతిక సమస్యలుంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ రికార్డులు స్వచ్ఛకరణ,డిజిటల్ రెవెన్యూ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రెవెన్యూ వన్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని,అన్ని రెవెన్యూ సేవలు 'రెవెన్యూ క్లినిక్ల' ద్వారా ఒకే గొడుగు కిందకు రావాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని, సమస్యలు మళ్లీ రీ-ఓపెన్ కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రెవెన్యూ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. భూ సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీవో జి మమ్మీ,తాసిల్దార్ చినబాబు ,భూ పరిపాలన సూపరిండెంట్ సుబ్బరాజు, ఉప తహశీల్దార్లు వంశీ ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల, అంగన్వాడికేంద్రంలోని న్నారులకు అన్నదాన కార్యక్రమం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అరవ శ్రీధర్.



**బొజ్జవారిపల్లె :( సిటిజన్ టైమ్స్ ):21:**

రైల్వే కోడూరు మండలం బొజ్జవారిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని జనసైనికులు ఏర్పాటు చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లిఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు నియోజకవర్గం శాసనసభ్యులు అరవ శ్రీధర్ పాల్గొని పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర కూటమి నాయకులు, జనసైనికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కిమ్స్ ప్రాంగణం లో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

## - బ్రహ్మశ్రీ డా.డి.ఎల్.గంగాధర శాస్త్రి గీతా ప్రవచనం

## 22వ తేదీ శ్రీ వెంకటేశ్వర స్వామీమి వారి కళ్యాణం -కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు









**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో గల శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మూడు రోజులు జరుగుచున్న ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా మొదటి రోజు ఏప్రిల్ 21 వ తేదీ మంగళ వారం నాడు ఉదయం 5 గంటలనుండి సంకల్పము,విశ్వక్సేన పూజ, అభిషేకము,స్వామి వారిని పెండ్లి కుమారుని చేయుట, దేవేరులను పెండ్లి కుమార్తెలను చేయుట, అర్చనా కార్యక్రమములు ఎంతో వైభవంగా జరిగాయి. కిమ్స్ చైర్మన్ కె.వి.వి సత్యనారాయణ రాజు బదరీ లక్ష్మి దంపతులు, ఎం,డి. రవి వర్మ శేష పవిత్ర దంపతులు, ఇ.డి.శశి వర్మ వెంకట లక్ష్మి దంపతులు దీక్షాధారణ చేసి బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు.సాయంత్రం 5గంటలకు వాస్తు హోమం , ధ్వజారోహణ,తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. అనంతరం భగవద్గీతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చైర్మన్ బ్రహ్మశ్రీ డా.డి.ఎల్.గంగాధర శాస్త్రి చే గీతా ప్రవచన కార్యక్రమము జరిగింది. ఆయన భగవద్గీత గానం చేసి తాత్పర్య సహితంగా వివరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమాలలో అనేక మంది పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు జరుగు ఈ బ్రహ్మోత్సవములలో భాగంగా రెండవ రోజు అనగా ఏప్రిల్ 22వ తేదీ బుధ వారం ఉదయం 5 గంటల నుండి అర్చన,లక్ష్మి హోమం, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు జరుగును. తదుపరి 8గంటలకు స్త్రీలచే అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజ జరుగును. సాయంత్రం 5 గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవము, తీర్థ ప్రసాద వితరణ జరుగును.

ఈ కార్యక్రమాలకు అందరూ ఆహ్వానితులే అని, అమలాపురం పరిసర ప్రాంతముల భక్త మహాశయులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని, శ్రీ స్వామి వారి సేవలో తరించవలసినదిగా కిమ్స్ చైర్మన్,కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) తెలియజేసారు.

# పంచముఖ విశ్వబ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశం హాజరైన ఎమ్మెల్యే కిషోర్. రెడ్డి



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (కలికిరి)ఏప్రిల్ 21. సిటిజన్ టైమ్స్.**

అన్నమయ్య మదనపల్లి జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరి పట్టణంలోని హేమాచారి కల్యాణమండపంలో మంగళ వారం పంచముఖ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ “విశ్వబ్రాహ్మణులు అనాదిగా సమాజానికి చేస్తున్న సేవలు అమూల్యం. మీ కళానైపుణ్యం, చేతివృత్తులను కాపాడుకోవాలి. మీ సంఘం అభివృద్ధికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. సంఘం సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచముఖ విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా, మండల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచముఖ విశ్వబ్రాహ్మణ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మెషిన్ ఎయిడ్స్ సురక్ష ప్రోగ్రామును విజయవంతం చేయండి



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (వాల్మీకిపురం ) ఏప్రిల్ 21 సిటిజెన్ టైమ్స్.**

అన్నమయ్య మదనపల్లి జిల్లా వాల్మీకిపురం లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఐసిటిసి కేంద్రంలో మెషన్ ఎయిడ్స్ సురక్ష ప్రోగ్రామ్ విజయవంతం చేయడానికి ముందస్తు ప్రణాళిక గురించి ఎల్ఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు, లింకు వర్కర్స్, స్కీం ప్రతినిధులతో ఐసిటిసి కౌన్సిలర్ లోకేష్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీలక్ష్మి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పరీక్షలను చేయుటకు హైరిస్కు ప్రాంతాల వారిని లారీ డ్రైవర్లు, వలస కార్మికులు, ఆటో డ్రైవర్లు, సెక్స్ వర్కర్లు, ఎం ఎస్ ఎం, టి ఎస్, టి జి లాంటి రిస్కు గల వ్యక్తులను క్యాంపులలో హెచ్ఐవి పరీక్షలు చేయాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమములో మెడికల్ సూపర్ండెంట్ డాక్టర్ మాలతి, ఐ సి టి సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమి, ఎల్ టి శ్రీ లక్ష్మి, సంస్థ ప్రతినిధులు మౌనిక, శోభ, వెంకటలక్ష్మి, లింక్ వర్కర్స్ కెవి రమణ,రాణి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కోసం పోరాటం చేస్తాం

## నారి శక్తి కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు 21న సీనియర్ నాయకురాలు నారీ శక్తి కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి ఆధ్వర్యంలో మహిళల 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై ప్రెస్ మీట్ బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కు, ఈ బిల్లుపై ప్రతిపక్షం అడ్డంకులు సృష్టించిన మహిళల సాధికారత కోసం మహిళలందరం పోరాటం సాగిస్తామని ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం మహిళలకు గౌరవం, అవకాశాలు, నాయకత్వం ఇవ్వాలని ప్రయత్నిస్తుంది. అందుకే పార్లమెంట్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రవేశపెట్టడం జరిగింది. ఇది మహిళల శక్తిని గుర్తించిన చారిత్రాత్మక నిర్ణయం ఇది సమానత్వానికి బలమైన ముందడుగు అని ఆవిడ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి, జిల్లా కార్యదర్శి మోకా ఆదిలక్ష్మి , మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహబూబ్ సాహీరా, బిజెపి నయకురాలు దాసరి రామేశ్వరి ,జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు ఎల్లన శకుంతల, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు దొంగ గంగా భవాని, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొండేటి జయలక్ష్మి, తెలుగుదేశం పార్టీ17 వ వార్డ్ ప్రెసిడెంట్ . దుర్గ, తెలుగుదేశం పార్టీ కార్యకర్త మేడిచర్ల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 22 నెలల్లోనే చరిత్రాత్మక అభివృద్ధి

# రూ.40 కోట్ల పనులు

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్, మంత్రి సుభాష్ కు కృతజ్ఞతలు తెలిపిన కూటమి పార్టీ నాయకులు

మంత్రి వాసంశెట్టి సుభాష్ పాలన భేష్

సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సామాజిక సేవలు ప్రశంసనీయం

మీడియా సమావేశంలో ఎన్డీఏ కూటమి ప్రతినిధులు



**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

లిరామచంద్రపురం పట్టణంలో గత 22 నెలల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిపై ఎన్డీఏ కూటమి నాయకులు నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశం విశేషంగా జరిగింది.ఈ సమావేశంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, టిడిపి ఉపాధ్యక్షులు చందమామ వాసు, బిజెపి నాయకులు కొట్టువాడ హరిబాబు, ఎస్కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, క్లస్టర్ ఇంచార్జి కంచుమర్తి బాబురావు, బీసీ సెల్ అధ్యక్షులు దంగేటి గౌరీ శంకర్, అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి జాస్తి విజయలక్ష్మి, వార్డ్ ఇంచార్జి దొమ్మలపాటి విజయలక్ష్మి, తెలుగు యువత అధ్యక్షులు కుడుపూడి ఫణి తేజ పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 22 నెలల్లోనే రామచంద్రపురం పట్టణంలో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం చరిత్రాత్మకమని నాయకులు పేర్కొన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకువస్తున్నారని ప్రశంసించారు.

**సీఎస్ఆర్, ఫౌండేషన్ ద్వారా సేవలు...:** ప్రభుత్వ నిధులతో పాటు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా కూడా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రూ.16 లక్షల సిఎస్ఆర్ నిధులతో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయడం, లెప్రసీ కాలనీలో రూ.8 లక్షలతో ఇళ్ల మరమ్మతులు చేయడం పేదల పట్ల ఉన్న కట్టుబాటుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో మూడు కంటైనర్ ఆస్పత్రులు, ఒక సంచార వైద్యశాలలు ఏర్పాటుచేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

**మానవతా దృక్పథంతో మంత్రి సేవలు...:** ప్రభుత్వ నేతల సహకారం -- వేగవంతమైన అభివృద్ధి ప్రధానమంత్రి మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, సహకారం, ప్రోత్సాహంతోనే అనతి కాలంలోనే భారీగా నిధులు సమీకరించి అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. రామచంద్రపురం పట్టణంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, త్రాగునీటి పైపులైన్లు, ప్రజా సదుపాయాల కల్పన వంటి పలు పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. అమృత్ 2.0 పథకం కింద రూ.15.75 కోట్లతో త్రాగునీటి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

**నిధుల సమీకరణలో విజయం..:** మున్సిపల్ సాధారణ నిధులు -- రూ.14 కోట్లు,15వ ఆర్థిక సంఘం నిధులు -- రూ.2.40 కోట్లు,ప్రత్యేక నిధులు -- రూ.3 కోట్లు,మున్సిపల్ శాఖ మంత్రి ద్వారా ప్రకటించిన నిధులు -- రూ.3 కోట్లు,ఇతర ప్రత్యేక నిధులు -- రూ.2.25 కోట్లు. ఈ విధంగా సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

**నియోజకవర్గంలో రూ.130 కోట్ల అభివృద్ధి**

మొత్తం నియోజకవర్గంలో సుమారు రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు, రాబోయే పుష్కరాల దృష్ట్యా మరో రూ.150 కోట్ల నిధులు రానున్నాయని కూటమి పార్టీ నేతలు పేర్కొన్నారు.

**ప్రజల సహకారం - కూటమి ఐక్యతే బలం..:** ఎన్డీఏ కూటమి ఐక్యత, ప్రజల మద్దతే అభివృద్ధికి ప్రధాన కారణమని తెలిపారు. ప్రతి వార్డులో అవసరాల మేరకు పనులు చేపడుతూ రామచంద్రపురాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు.

**మంత్రి సుభాష్ సేవలకు కృతజ్ఞతలు..:** మాటల్లో కాకుండా పనుల్లో చూపిస్తూ ప్రజాసేవకు అంకితమైన మంత్రి వాసంశెట్టి సుభాష్కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంకు ప్రజల మద్దతు అవసరమని పేర్కొన్నారు.

శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.25 లక్షల సొంత నిధులు వెచ్చించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**అభివృద్ధిలో ముందంజలో రామచంద్రపురం:** రామచంద్రపురం పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం 30 కోట్లతో ప్రతిపాదనాల సిద్ధం చేసి పంపడం పట్ల పట్టణ ప్రజల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్న మంత్రి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, నియోజకవర్గ ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని స ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు కట్టా నాగేశ్వరావు, కవల నానాజీ, అల్లం శ్రీనివాస్, గుబ్బల రమణ, వైట్ల సూర్యప్రకాష్, మేడిశెట్టి సూర్యనారాయణ, పసుపులేటి సత్తిబాబు,గడి గోవిందు,బల్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్గా కుమారేశ్వరన్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ గా ఆర్ఎస్ కుమారేశ్వరన్ పదవి బాధ్యత లు చేపట్టారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సూపర్డెంట్గా విధులు నిర్వహించి కోనసీమ జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ గా బాధ్యతలు తీసుకున్నారు. గత ఎఫ్ఎసి ఎక్సైజ్ సూపర్డెంట్ గా పనిచేసిన సామర్లకోట గొడజెన్ కు చెందిన రామకృష్ణ అదే స్థానానికి వెళ్లిపోయారు. ఎక్సైజ్ జిల్లా సూపర్డెంట్ గా కుమారేశ్వరన్ బాధ్యతలు తీసుకుని మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ రాహుల్ మీనా ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సఖినేటిపల్లిలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం..






**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 21**

చిన్న పిల్లలు టివిలు, మొబైల్ ఫోన్లు కు అలవాటు పడకుండా తగిన తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలని అంగన్వాడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇందిరా అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొనినారు. మంగళ వారం సఖినేటిపల్లి గ్రామంలో 8వ పోషన్ పక్వాడ్ కార్యక్రమాన్ని 11 మంది అంగన్వాడి వర్కర్స్ సంయుక్తంగా నిర్వహించారు. టీవీ స్క్రీన్ లకు మొబైల్ ఫోన్లకు పిల్లలు అలవాటు పడకుండా, తల్లిదండ్రులతో కలిసి ఆడుకునేలా పిల్లలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తెలిపారు. అదేవిధంగా పిల్లలు జంక్ ఫుడ్ కి అలవాటు పడకుండా హోమ్ ఫుడ్ పట్ల ఆసక్తి పెరిగేలా, తల్లిదండ్రులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపర్ వైజర్ భారతి సమక్షంలో పిల్లలతో బొమ్మల తయారీ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

## రాజకీయాల్లోకి వచ్చే మహిళలకు స్వాగతం - నా పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే భరోసా





**దెందులూరు:( సిటిజన్ టైమ్స్ ):ఏప్రిల్ 21:**

మహిళల ఆర్థిక మరియు సామాజిక సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం దెందులూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం - ఎస్ ఇ ఆర్ పి సౌజన్యంతో నియోజకవర్గంలోని 188 మంది వివో ఏ లకు స్మార్ట్ ఫోన్లను, అలాగే 34 స్వయం సహాయక సంఘాల సభ్యులకు పీఎం ఏ జే ఏ వై పథకం కింద మంజూరైన రూ. 34 లక్షల చెక్కును ఎమ్మెల్యే ప్రభాకర్ లబ్ధిదారులకు స్వయంగా పంపిణీ చేశారు.

గత ప్రభుత్వ అరాచకాలపై ధ్వజం:

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. "గత వైసీపీ పాలనలో మహిళలను కేవలం సిద్ధం సభలకు సంఖ్యాబలం కోసం వాడుకుని ఇబ్బందులు పెట్టారు. కానీ మన కూటమి ప్రభుత్వం 'దీపం', 'తల్లికి వందనం', 'స్త్రీ శక్తి' వంటి పథకాల ద్వారా వారిని మహాలక్ష్మిలుగా గౌరవిస్తోంది. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుంటే, కొన్ని పార్టీలు కుట్రలు చేసి అడ్డుకోవడం మహిళా ద్రోహం" అని మండిపడ్డారు.

**అక్రమాలపై ఉక్కుపాదం:** డ్వాక్రా సంఘాల్లో కొందరు వ్యక్తులు తమ కుటుంబ సభ్యులనే చేర్పించి, ఇతరులకు అందాల్సిన నిధులను దారి మళ్లిస్తూ అక్రమ లబ్ధి పొందుతున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని రాజకీయాలకు అతీతంగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు, సీఏలకు సూచించారు. "సిఏలు జాలితోనో, రాజకీయ ఒత్తిడితోనో అక్రమాలకు తావివ్వకూడదు. పారదర్శకతతో పనిచేసి ప్రతి పేద మహిళకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆదేశించారు.

**మహిళలకు గొప్ప పిలుపు - రాజకీయ భరోసా:** మహిళలకు ఎమ్మెల్యే ఒక పవర్‌ఫుల్ సందేశాన్ని ఇచ్చారు. "రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడంలో మహిళల పాత్ర కీలకం. మీలో ఎవరైనా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని ఆసక్తి చూపిస్తే, నేను మీకు ఒక అన్నగా సాదర స్వాగతం పలుకుతున్నాను. మీ రాజకీయ ఎదుగుదలకు నేను వెన్నుదన్నుగా ఉంటా, మీకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతా" అని ఆయన ఇచ్చిన భరోసా మహిళల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళలు వారధిగా ఉండాలని కోరారు.

**ఘన స్వాగతం - ఆత్మీయ విందు:** ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి మహిళలు, అధికారులు, కూటమి నేతలు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే మహిళలందరికీ ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించి తన ఆత్మీయతను చాటుకున్నారు. అంతేకాకుండా మహిళలకు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని ఐస్ క్రీములు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే గారు స్వయంగా సమావేశంలో మహిళలకు అందజేశారు..

ఈ కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిఆర్డిఏ పిడి విజయలక్ష్మి , దెందులూరు మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ గారపాటి రామసీత , వివిధ సహకార సొసైటీల చైర్మన్లు సహా పలువురు కూటమి నాయకులు నియోజకవర్గం పరిధిలోని ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ముమ్మిడివరం ఎమ్మెల్యే



**కాట్రేనికోన సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

మండలంలోని పల్లంకుర్రు లో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్,ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధానంగా భావిస్తూ కనీస మద్దతు ధర ( ఎం ఎస్ పి ) ప్రకారం ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయడానికి ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా, తమ పంటను నేరుగా ప్రభుత్వానికి విక్రయించుకునే విధంగా ఈ పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇకపై రైతులు తమ ధాన్యాన్ని సరైన ధరకు, పారదర్శకంగా అమ్ముకునే అవకాశాన్ని ఈ కేంద్రం కల్పిస్తుందని, రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు ఎటువంటి సందేహాలు లేకుండా, స్వేచ్ఛగా తమ పంటను ఈ కేంద్రాల ద్వారా విక్రయించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్ ,కంచు స్తంభం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మురముళ్ళ శ్రీ వీరేశ్వర స్వామి సేవలో మంత్రి సతీమణి


**ఐ పోలవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

మురమళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి డా.బీ.ఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇంచార్జి మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు సతీమణి విజయ మాధవి మంగళవారం మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.తొలుత వీరికి ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ ఘనస్వాగతం పలికారు. అనంతరం అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం అందించారు. స్వామి వారి శేష వస్త్రం తో సత్కరించి, చిత్రపటం ప్రసాదం అంచించి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత అడిగి తెలుసుకున్నారు.



# నిస్వార్థసేవే జనసేన లక్ష్యం

**తాడేపల్లిగూడెం:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్:21**



ఎలాంటి పదవులు, ప్రయోజనాలు ఆశించకుండా నిస్వార్థంగా ప్రజాసేవ చేయడమే జనసైనికుల లక్ష్యమని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ లో మంగళవారం బొలిశెట్టి శ్రీనివాస్ సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో ప్రజల దహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. ఈ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలియజేశారని అందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.ముఖ్యమైన ప్రాంతాల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు . తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జనసేన, టిడిపి, బిజెపి పార్టీలు కలిసిమెలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాయని, ఆదర్శవంతంగా ముందుకు వెళ్తామని తెలియజేశారు. బస్టాండ్ కోడలిలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మతో ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. ఈ రహదారికి శివాజీ మార్గం అనే నామకరణంచేస్తామని తెలియజేశారు.తాను ఏ పని అభివృద్ధి విషయంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన పురపాలక కమిషనర్ ఏసుబాబు తక్షణమే స్పందించి, సహకరిస్తున్నారని అన్నారు. రాజకీయంగా తాము ఎంత కృషిచేసినా అధికారుల సహకారం ఉంటేనే ముందుకెళ్లగలమని, ఆ విషయంలో పురపాలక, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు బాగా పనిచేస్తున్నారని తెలిపారు. నేటి తరానికి దేశభక్తి గురించి అవగాహన కల్పించాలని అన్నారు. కేవలం మార్కులు, ఉద్యోగం, ధన సంపాదనలకే పరిమితం కాకుండా, దేశభక్తి, త్యాగమూర్తుల గురించి తెలియజేయాలన్నారు. దేశాన్ని ఏకతాటిపై నడిపించి చత్రపతిగా కీర్తి పొందిన శివాజీ తదితర మహనీయుల దేశభక్తిని,సేవానిరతిని నేటితరం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో,కూటమి నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

# స్వీయ గణన పై జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి సమీక్షా సమావేశము




**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

మండల పరిషత్ కార్యాలయము నందు ఇండ్ల జాబితా గణన పై చివరి బ్యాచ్ ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను జిల్లా ముఖ్యప్రణాళికాధికారి జిల్లా మాస్టర్ ట్రయినర్ ఎం .మురళీకృష్ణ సందర్శించారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందరు సచివాలయము ఉద్యోగులు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) విధిగా చేసుకోవాలని,వారి బంధువులు, మిత్రులను కూడా స్వీయ గణన చేసుకునేలా ప్రోత్సహించాలని సూచిశీచినారు. మనరాష్ట్రములో స్వీయ గణన కార్యక్రమము ఏప్రిల్ 30వ తేదీతో ముగుస్తుంది కావున ఎన్యూమరేటర్లు మీ పరిదిలో రోజుకు కనీసం 10 నుండి 15 కుటుంబాలు స్వీయ గణన చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమములో తహసిల్దార్ మరియు ఛార్జ్ ఆఫీసర్ తాడి సుబాష్, డిప్యూటీ తహసిల్దార్ గోపాల కృష్ణ , అమలాపురం డివిజన్ ఉప గణాశీక అధికారి ఏ. ప్రభుదాసు ,ఏ.ఎస్.ఓ. కె .ఎల్.ఎన్. శాస్త్రి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామమోహన్ ,మండల ట్రయినర్లు రాంబాబు , దశరధరామయ్య , ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల లు పాల్గొన్నారు.



## పలు ఆలయాలను దర్శించిన ఎంపీ హరీష్ బాలయోగి






**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ బండారులంక గ్రామ దేవత దేవి మురుగులమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని ఎంపీ హరీష్ బాలయోగి దర్శించుకున్నారు. కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని, రోళ్లపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని ఎంపీ హరీష్ బాలయోగి దర్శించుకున్నారు.

## వీరవల్లిపాలెంలో ప్రారంభమైన రీ సర్వే



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవర్గం అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైనది. మండల సర్వేయర్ కోలా ఉమ మాట్లాడుతూ జిరాయితీ వ్యవసాయ భూములను కొలిసి కచ్చితంగా సర్వే నిర్వహించి భూమి గల వారికి స్వాధీనం చేయుట జరుగుతుందని,రీ సర్వే విషయం భూములు గల రైతులకు అందరకు గ్రామసభను ఏర్పాటు చేసితెలియపరచడం జరిగిందని,ఈ సర్వే జరుగు సమయంలో భూమి గలవారు అందుబాటులో ఉండి సర్వే అధికారులకు సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కోలా ఉమ, గ్రామ రెవెన్యూ అధికారి తోటకూర భాగ్య ధనలక్ష్మి, ఇతర గ్రామాల సర్వేలు, రైతులు ఉన్నారు.

## క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు 5+ స్మార్ట్ ఫోన్లు



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (కలికిరి)ఏప్రిల్ 21. సిటిజన్ టైమ్స్**

అన్నమయ్య మదనపల్లి జిల్లా కలికిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పీలేరు నియోజకవర్గానికి చెందిన 220 మంది సంఘమిత్రులకు ప్రభుత్వం తరఫున 5+ స్మార్ట్ ఫోన్లను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. పీడీ నాగేశ్వరరావుతో కలిసి సంఘమిత్రులకు ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి త్వరగా తీసుకెళ్లేందుకు, డిజిటల్ సేవలను మెరుగుపరిచేందుకు ఈ 5+ స్మార్ట్ ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయి. మీ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ ఫోన్లు అందిస్తోంది. వీటిని ప్రజా సేవకు వినియోగించి పథకాల అమలును వేగవంతం చేయాలి" అని సూచించారు.పీడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ 5+ సాంకేతికతతో పని మరింత సులభమవుతుందని, సంఘమిత్రులు అంకితభావంతో పని చేయాలని కోరారు. ఫోన్లు అందుకున్న సంఘమిత్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు. నల్లారి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు అధికారి గా విజయలక్ష్మి

## జిల్లాస్థాయిలో స్వర్ణ గ్రామం స్వర్ణవార్డులను పర్యవేక్షించే అధికారుల విధులు కీలకం

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 విజన్, ప్రస్తుత పరిపాలనా సంస్కరణల నేపథ్యంలో జిల్లా స్థాయిలో స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డులను పర్యవేక్షించే అధికారుల విధులు అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం నూతనంగా జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఆఫీసర్‌గా నియమింపబడ్డ వి.విజయ లక్ష్మి స్థానిక కలెక్టరేట్ నందు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజలకు సమర్థవంతం గా అందిం చేందుకు కృషి చేయాలని సూచించారు. సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి శాఖపరమైన కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందు కు అవసరమైన చర్యలు తీసుకుంటూ జిల్లాను సంక్షేమ పథకాలు,పారిశుద్ధ్య పథకాల అమల్లో ముందంజలో నిలపాలన్నారు. తద్వారా స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామం వ్యవస్థలో అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పాలన్నారు.?జిల్లా స్థాయి పర్యవేక్షక అధికారులైన డి ఎల్ డి వో లు, మున్సిపల్ కమిషనర్ లేదా జిల్లా కలెక్టర్ నిర్దేశించిన నోడల్ అధికారులు నిర్వహించాల్సిన ప్రధాన బాధ్యతలు సమగ్రంగా నిర్వర్తించాలన్నారు.?పౌర సేవల నాణ్యత తోపాటు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు నిర్ణీత కాలపరిమితి లోపు పరి ష్కారమయ్యేలా పర్య వేక్షిస్తూ సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు?. జిల్లా లోని స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డులలో ఎటువంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండ కుండా అర్హులందరికీ



న్యాయం చేకూర్చాలన్నారు .సేవలపై ప్రజల నుండి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకుని, సంతృప్తి స్థాయిలు నూటికి నూరు శాతం ఉండేలా ప్రత్యేక చొరవ తీసుకో వాలన్నా రు.?సంక్షేమ పథకాల పంపిణీ లో రాజకీయాలకు అతీతంగా, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి పథకాలు అందుతున్నా యా లేదా అనేది తనిఖీ చేయాలని గ్రామ/వార్డు సభల ద్వారా లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించి, పారదర్శకతను మరింత పెంపొందించాలన్నారు డోర్ డెలివరీ సేవలు సజావుగా సాగేలా వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు.మౌలిక సదుపాయాల కల్పనలో కీలకంగా వ్యవహరించాల న్నారు ?స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు పరిధిలో 100% చెత్త సేకరణ మరియు పారిశుధ్య నిర్వహణను చేపట్టేలా కృషి చేయాలన్నారు.సచివాలయాల్లో లైబ్రరీలు ఇంటర్నెట్, కంప్యూటర్లు,



ప్రజలు వేచి ఉండటానికి అవసరమైన వసతులను తనిఖీ చేస్తూ సంతృప్తికరమైన పౌర సేవలను అందించాలన్నారు . ఈ సందర్భంగా జిల్లా స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు అధి కారిగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి ప్రసంగిస్తూ వార్డు గ్రామ పరిధిలో పచ్చదనం పెంచే కార్యక్రమాలను ప్రోత్సహించడం జరుగుతుందని, పరిపాలన సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా వ్యవస్థను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ?నైపుణ్యాభివృద్ధి ద్వారా సిబ్బందికి ఎప్పటిక ప్పుడు కొత్త సాంకేతికతపై శిక్షణ ఇస్తామన్నారు.నగదు నిల్వలు,స్టాక్ రిజిస్టర్లు,ప్రభుత్వ ఆస్తుల రికార్డులను కాలానుగుణంగా తనిఖీ చేయడం.?జిల్లా స్థాయి స్పందనలో వచ్చే ఫిర్యాదులను స్వర్ణ సచివాలయ అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్క రించడం జరుగుతుందన్నారు. వారానికి కనీసం రెండు సార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసు కోవడం జరుగుతుందన్నారు. స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు ప్రత్యేక లక్ష్యాలైన పౌరులకు సంక్షేమ పథకాల అమలు మరియు చెత్త సేకరణ అంశంలో నూటికి నూరు శాతం నాణ్యమైన సేవలు సమయానుకూలంగా అందిస్తానన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలను సాధించడం జరుగుతుందన్నారు.ఆస్తి నీటి పన్ను వసూళ్లు సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పారద ర్శకత కోసం సచివాలయాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సువిజయ్, సిబ్బం ది పాల్గొన్నారు.

## వేసవి శలవుల్లో పిల్లలు పట్ల తల్లితండ్రులు అప్రవత్తంగా ఉండాలి: సీఐ సురేష్




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

వేసవి శలవులు ప్రారంభం అవుతున్నాయి. ఈతకు వెళ్లకుండా తమ పిల్లలు పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు అర్బన్ సి ఐ కే సురేష్ విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులు వస్తున్న నేపథ్యంలో తల్లితండ్రులు తమ పిల్లలపై పూర్తిగా నిఘా ఉంచాలన్నారు. మీ ప్రాంతాలలోని బావులు, చెరువులు, వాగులలోకి పిల్లలు ఈతకు వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అంతే కాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా తవ్విన గుంటలలో ఈత సరదా తీర్చుకునేందుకు చిన్నారులు వెళుతూ ఉంటారని గతంలో ఇటు వంటి గుంటలలో ఈతకు వెళ్లి చిన్నారులు మృతి చెందిన సంఘటనలు సీఐ గుర్తు చేశారు. కాబట్టి ఎప్పటికప్పుడు పిల్లల్ని హెచ్చరిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో మే 4న విస్తృతస్థాయి సమావేశం





**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాయలసీమ ఎత్తి పోతల పథకం మరియు వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతి మరియు కృష్ణా జలాల పంపిణి పై మే 4 వ తేదీ సోమవారం న మార్కాపురం లోని సౌజన్య ఫంక్షన్ హాల్ నందు జరుగు సమావేశం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ అన్నా రాంబాబు, అన్నా కృష్ణ చైతన్య, కొండపి నియోజకవర్గ పరిశీలకులు షంషీర్ అలీ బేగ్, మరియు నియోజవర్గ ముఖ్య నాయకులు..

## ప్రభుత్వ కళాశాలల్లోనే ఉజ్వల భవిష్యత్





**పొన్నలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర బాబుఅన్నారు. ఆయన ఆధ్వర్యంలోపొన్నలూరు మర్రిపూడి మండలాలలోని రాజుపాలెం తంగెల్లా పలు గ్రామాలలో ప్రచారం ప్రారంభించారు. కళాశాలలోనే విద్యార్థులు చేరేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థుల ఇళ్లకి వెళ్లి ప్రిన్సిపల్,అధ్యాపకులు ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. రాజేంద్ర బాబు మాట్లాడుతూ నీట్ ఎంసెట్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారని ప్రయోగశాలలు, అర్హులైన విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద 15 వేల రూపాయలు అందిస్తున్నామని, మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్నామని తెలిపారు. ప్రచారంలో భాగంగా కర్ర పత్రాలు ఇంటింటికి తిరిగి విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ రైల్వేప్రోజెక్ట్ నిర్మాణపనులు జరగకపోవడం పట్ల ఆరా తీసిన జేఏసి కార్యవర్గము



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

కోటిపల్లి - నర్సాపురం రైల్వేప్రోజెక్ట్ నిర్మాణ పనులు ప్రస్తుతం జరగకపోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు ఈ రోజు సంబంధిత రైల్వే డిప్యూటీ సిఈ శ్రీధర్ (గుంటూరు,సౌత్ సెంట్రల్ రైల్వే ఆఫీస్)గారితో జేఏసి కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఫోన్ లో మాట్లాడటం జరిగింది.ఇప్పటికే వేసవికాలం ప్రారంభం అయ్యి సగం రోజులు గడిచిపోయింది,వర్షా కాలం వస్తె నిర్మాణ పనులు వేగవంతంగా జరగవని కన్వీనర్ ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఈ స్పందిస్తూ ఈ క్రింది వివరాలు వెల్లడించారు. వైనతేయ, వశిష్ట నదుల వద్ద గల రైల్వే బ్రిడ్జిలకు సంబంధించిన సూపర్ స్ట్రక్టర్స్ ( గార్డర్స్) పనులు మహారాష్ట్ర యందు మన్మాడ్,గుజరాత్ యందు సబర్మతి రైల్వే వర్క్ షాప్ లలో జరుగుతున్నాయని,80 శాతం పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. వశిష్ట నది లో మునిగిపోయిన పిల్లర్ కు ప్రత్యామ్నాయంగా 2 పిల్లర్స్ వేయడానికి డిజైన్ రెడీ అవుతుందని అన్నారు. కోటిపల్లి గౌతమి నది రైల్వేవంతేన పై సూపర్ స్ట్రక్టర్స్ వేయడానికి టెండర్ దక్కించుకున్న ప్రసాద్ అండ్ కంపెనీ కు తమకు మధ్య కోర్టు వ్యవహారం జరుగుతున్నందున అక్కడ పనులు ఆలస్యం గా ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. లిభూసేకరణ కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఎపుడు భూమిని సేకరించి అప్పచెబితే అప్పటి నుండి తమ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భూసేకరణ కు సంబంధించి రాష్ట్రప్రభుత్వం యొక్క ఉదాసీన వైఖరిని జేఏసి కార్యవర్గం ఆక్షేపించింది.ఇది పూర్తిగా కోనసీమ ప్రజాప్రతినిధుల వైఫల్యంగా పేర్కొంది.

## దారకానిపాడులో పోషన్ పక్వాడపై అవగాహన

### సూపర్వైజర్ కె.కామేశ్వరి



**గుడ్లూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

ఉలవపాడు ప్రాజెక్టు పరిధిలోని గుడ్లూరు మండలం గుడ్లూరు-2 సెక్టార్ లోని దారకనిపాడు పంచాయతీలో ఉన్న దారకనిపాడు అంగన్వాడి సెంటర్ నందు సీడీపీఓ మాధవీలత ఆదేశాల మేరకు పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సూపర్వైజర్ కె.కామేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కామేశ్వరి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హాజరైన గర్భవతులు, బాలింతలు, ఏడు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ పక్వాడ గురించి తెలియపరచడం జరిగిందన్నారు. చిన్నపిల్లల మానసిక వికాసానికి అడ్డంగా మారుతున్న సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యక్రమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. అలాగే రోజువారి ఆహారపు అలవాటుగా మారుతున్న జంక్ ఫుడ్ తీసుకోవడం వలన పిల్లలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, జంక్ ఫుడ్ వలన కలిగే నష్టాల పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్లు టీవీలు చూడటం వలన వారి మానసిక వికాసం దెబ్బతింటుందని తద్వారా ఆలోచన శక్తి, తెలివితేటలు, సృజనాత్మకత, మందగిస్తుందన్నారు. అలాగే మరి కొంతమందిలో మాటలు రాకపోవడం, చూపు మందగించడం, ఊహాశక్తి లోపించటం, తదితర సమస్యలు తలెత్తుతాయని, బుల్లితెర కు చిన్నపిల్లలను దూరంగా ఉంచేందుకు చక్కటి కథలు. ఆటపాటల. ద్వారా భాష నైపుణ్యాలు ఆరుబయట ఆటలను ఆడించడం సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించడం. వంటివి చేయాలని అంగనవాడి కార్యకర్తలకు గర్భవతులకు బాలింతలకు సూచించారు. ఇటీవల కాలంలో జంక్ ఆహారం వినియోగించడం పెరిగిందనీ, ముఖ్యంగా బాలింతలు గర్భవతులు ఈ ఆహారం తీసుకోవడం వలన మధుమేహం, గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, ఎక్కువగా తలెత్తుతున్నాయనీ పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తూ, ప్రకృతి సహజ సిద్ధమైన చిరుధాన్యాలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తీసుకునేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త శివలీల, దేవరాజ్యం, గర్భవతులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన సత్య



**పొన్నలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

మండల కేంద్రమైన పొన్నలూరులో శనివారం గుండెపోటుతో మృతి చెందిన టిడిపి గ్రామ అధ్యక్షుడు నల్లపనేని కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను మంగళవారం మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, సీనియర్ టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, మండవ మురళీమోహన్, పల్లపోతు రమేష్ బాబు, ఎల్ బ్రహ్మ పేరయ్య,వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## వృత్తివిద్యా కోర్సుతో భవిష్యత్

### గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు వెల్లడి



**అర్ధవీడు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

వృత్తివిద్యా కోర్సుతో భవిష్యత్ అవకాశాలు ఉంటాయని అర్ధవీడు బిఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వరరావు పేర్కొ న్నారు. మంగళవారం మండల కేంద్రమైన అర్ధవీడు గురుకుల పాఠశాల నందు ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్షిప్ పూర్తయి నందున వారికి ప్రిన్సిపాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువు మీద ధ్యాస కొనసాగించాలన్నారు. ప్రతి విద్యార్థి కూడా బాగా చదువుకొని ఉన్నతస్థాయిలో ఉండాలని, తల్లిదండ్రులకు, గురు వులకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు షేక్ సుభాని, డి రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## 26 న సి.ఎస్.పురంలో సబ్ జూనియర్ బేస్బాల్ జట్టు ఎంపికలు

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 21**

మండల కేంద్రం సి.ఎస్.పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 26న సబ్ జూనియర్ బేస్బాల్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు మార్కాపురం జిల్లా బేస్బాల్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి పెరుగు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగిశెట్టి రాజా ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంపికల్లో 01-01-2011 నుండి 31-12-2013 మధ్య జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని సూచించారు.



## కృతి శెట్టి బ్లాక్ స్ట్రాప్‌లెస్ గౌన్‌లో డ్రీమీ లుక్‌తో స్టన్ చేసింది

# టాప్- 10 హీరోయిన్ల చీర సొగసు



భారతీయ సంప్రదాయంలో చీరకు ఉన్న ప్రాధాన్యత గురించి తెలిసిందే. పండుగ ఏదైనా.. భామలు చీరకడితే ఆ కళే వేరు. 2026 -విషు- పండుగ సందర్భంగా భారతీయ చలనచిత్ర రంగంలోని అగ్ర కథానాయికలు తమ చీరకట్టుతో సౌందర్యాన్ని, మోడ్రన్ స్టైల్ ను మేళవించి సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తున్నారు. సంప్రదాయ నేత మొదలుకొని .. సింపుల్ ఆర్గంజా వస్త్రాల వరకు తారలు తమ ఫ్యాషన్ ఎంపికలతో పండుగ వాతావరణానికి మరింత శోభను చేకూర్చారు. మహానటి కీర్తి సురేష్ తన రాయల్ గోల్డ్ చీరలో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా మెరిసిపోతున్నారు. దీనికి స్టేట్‌మెంట్ టెంపుల్ జువెలరీని జోడించి పండుగ కళను ఉట్టిపడేలా చేశారు. అలాగే త్రిష కృష్ణన్ క్రీమ్ అండ్ గోల్డ్ సిల్క్ చీరలో క్లాసిక్ లుక్‌ను ప్రదర్శించగా.. రెడ్ కలర్ బ్లౌజ్ ఆ అందానికి మరింత మెరుగులు దిద్దింది. నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఆఫ్-వైట్ సిల్క్ చీరలో... జుట్టులో మల్లెపూలతో దేవకన్యలా కనిపిస్తూ విషు పండుగ విశిష్టతను చాటిచెప్పారు.

మరోవైపు నయనతార బంగారు వర్ణం టిష్యూ సిల్క్ చీరలో రాచరికపు హుందాతనాన్ని ఒలకబోయగా... సమంత రూత్ ప్రభు పసుపు - ఆకుపచ్చ రంగుల మేళవింపుతో కూడిన చీరలో దేవకన్యను తలపిస్తున్నారు. పార్వతి ఎరుపు రంగు చీరపై గోల్డెన్ ఫోయిల్ వర్క్‌తో సంప్రదాయ మూలాలను ప్రతిబింబించగా.. అదితి రావు హైదరీ ఊదా రంగు చీర -భారీ ఆభరణాలతో పండుగ వైబ్ ని నింపారు. వీరందరి మేకోవర్స్ సంప్రదాయానికి పట్టాభిషేకం చేసినట్లుగా ఉన్నాయి. ప్రయోగాలకు వేదికగా నిలిచిన రుక్మిణి గ్రీన్-అండ్-పింక్ కాంట్రాస్ట్ చీరలో కట్ అవుట్ బ్లౌజ్‌తో విభిన్నంగా కనిపించగా... సాన్యా మల్హోత్రా బేబీ పింక్ ఆర్గంజా చీరను పర్పుల్ బ్రోకేడ్ బ్లౌజ్‌తో జతచేసి రొమాంటిక్ అండ్ ఫెస్టివ్ లుక్‌ను సృష్టించారు. జాన్వీ కపూర్ హెవీ ఎంబ్రాయిడరీ గోల్డ్ చీరతో తన గ్లామర్‌ను ప్రదర్శిస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలియా భట్ మాత్రం సింపుల్ బ్లూ ప్రింటెడ్ చీరతో -తక్కువలోనే ఎక్కువ అందం- అన్నట్లుగా ఆకట్టుకున్నారు.ఓవరాల్ గా అగ్ర కథానాయికలందరూ చీరకట్టులో మెరిసిపోతూ ఫ్యాషన్ ప్రియులకు గొప్ప ప్రేరణగా నిలిచారు. ఆధునిక కాలంలో వెస్ట్రన్ దుస్తులకు ఎంత ప్రాధాన్యత ఉన్నా.. పండుగ వేళ చీరకట్టు ఇచ్చే ఆత్మవిశ్వాసం, గౌరవం మరే ఇతర దుస్తుల్లోనూ ఉండదని ఈ భామల ఫోటోలు నిరూపిస్తున్నాయి. ఈ విషు వేడుకల్లో తారల -చీర సొగసు- సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారి పండుగ సంబరాలను రెట్టింపు చేసింది.



## మెరూన్ లెహంగా లుక్

# చాహల్‌తో డేటింగ్ పుకార్లు ఫేక్.. కోహ్లీ లాంటి అబ్బాయి కావాలన్న యాంకర్



ఇటీవల టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో బిగ్ బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కలిసి ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో, వీరిద్దరు డేటింగ్ చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా ఊపందుకుంది. ఈ తప్పుడు ప్రచారంపై షెఫాలీ బగ్గా సోషల్ మీడియాలో తనపై వస్తున్న డేటింగ్ వార్తలపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా క్రికెటర్లతో తనని ముడిపెడుతూ వస్తున్న గాసిప్స్ పై తీవ్రంగా మండిపడింది. ప్రజల ఆలోచనా విధానం మరీ చిన్నదిగా ఉంది. ఒక డిన్నర్‌కు వెళ్తే అది డేటింగ్ అని ఎలా అనుకుంటారు? ఇలాంటి చిన్నచూపుతో నేను విసిగిపోయాను.. వాస్తవం ఏంటో నాకు, నా ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది.

### నా వ్యక్తిగత జీవితం వేరు!:

క్రికెటర్లతో రిలేషన్‌షిప్‌పై ఆమెకు స్పష్టమైన అభిప్రాయం ఉంది. ఇది నా వృత్తి (గ్రాతీశీటవంంఱశీఅ).. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు.. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన లేదని షెఫాలీ బగ్గా తేల్చి చెప్పింది.

### కోహ్లీ లాంటి 'పర్ఫెక్ట్ పార్ట్నర్' కావాలి!:

తనకు కాబోయే భాగస్వామి ఎలా ఉండాలో వివరిస్తూ, విరాట్ కోహ్లీ - అనుష్క శర్మ జంటను ఉదాహరణగా చూపించారు. విరాట్ ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ఆ అంకితభావం, ఆరాధన తనకు ఇష్టమని ఆమె పేర్కొన్నారు. తన భాగస్వామి తనతో ఉన్నప్పుడు పూర్తిగా తనకే సమయం కేటాయించాలని, తనపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలని ఆకాంక్షించింది. లగ్జరీల కంటే ప్రేమించే మనసు, తనను కేర్ చేసే గుణం ఉంటే చాలని షెఫాలీ బగ్గా వెల్లడించింది.

### కెరీర్‌పైనే ఫోకస్!:

ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే తన కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు షెఫాలీ బగ్గా వెల్లడించారు. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక లీగ్స్‌లో యాంకర్‌గా రాణిస్తున్న షెఫాలీ, త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.

# ఐపీఎల్ తర్వాత టీమిండియా బిజీ షెడ్యూల్.. బీసీసీఐ తీరుపై గంభీర్, గిల్ అసంతృప్తి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ ఫైనల్ మే 31వ తేదీతో ముగియనుంది. అనంతరం భారత జట్టు వరుస సిరీస్ లతో బిజిబిజీగా ఉండనుంది. తీరిక లేకుండా మ్యాచ్ ల షెడ్యూల్ రూపొందించడంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బీసీసీఐ (భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు)పై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. జూన్ 6 నుంచి -10 మధ్య ముల్లాన్ పూర్ లో భారత్, అఫ్గానిస్థాన్ మధ్య టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్లతో ఎలాంటి సంబంధం లేదు. దీంతో అగ్రశ్రేణి ప్లేయర్స్ కి రెస్ట్ ఇచ్చి యంగ్ క్రికెటర్స్ ని బరిలోకి దింపాలని టీమిండియా మేనేజ్మెంట్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. జస్ ప్రీత్ బుమ్రా, శుభ్‌మన్, కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా లాంటి సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. ఫస్ట్-క్లాస్ క్రికెట్ లో ఆకట్టుకున్న గుర్నూర్ బ్రార్, మానవ్ సుతార్, ఆకిబ్ నబీ, దేవదత్ పడిక్కల్ వంటి ప్లేయర్స్ ని అఫ్గానిస్థాన్ తో టెస్టు మ్యాచుకి సెలక్ట్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు బీసీసీఐ అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్ 2026 ముగియగానే టీమిండియా వరుస సిరీస్ లతో తీరిక లేకుండా క్రికెట్ ఆడనుంది. జూన్ మాసంలో అఫ్గానిస్థాన్ తో టెస్టు మ్యాచ్, మూడు వన్డేలని ఆడబోతుంది. తర్వాత రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్ టూర్ కి వెళ్లనుంది. ఇక జులై నెలలో ఇంగ్లాండ్ గడ్డపై పర్యటించి ఆతిథ్య జట్టుతో ఐదు వన్డేలు, 3 టీ20 మ్యాచుల్లో తలపడనుంది. అలాగే జులై 23వ తేదీ నుంచి జింబాబ్వే, టీమిండియా మధ్య మూడు టీ20ల సిరీస్ స్టార్ట్ కానుంది. దీంతో వరుస సిరీస్ లతో ఆటగాళ్లు తీవ్రంగా ఇబ్బంది పడతాడంతో పాటు జట్టులో గాయాల బెడద పెరిగే ఛాన్స్ ఉందని కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ పేర్కొన్నట్లు తెలుస్తుంది.

# సొంతగడ్డపై సన్ రైజర్స్ హ్యాట్రిక్... ఢిల్లీపై అద్భుత విజయం



ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. సొంత మైదానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ పరుగుల సునామీ సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ అజేయ, విధ్వంసకర శతకంతో కదం తొక్కడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ కు ఇది వరుసగా మూడో విజయం. ఈ విజయంతో ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ బ్యాటింగ్ ప్రదర్శన విధ్వంసక రీతిలో సాగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలింగ్ ను ఊచకోత కోశాడు. కేవలం 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37), ఇషాన్ కిషన్ (25) వేగంగా ఆడగా, చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ, క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. నితీశ్ రాణా (30 బంతుల్లో 57), సమీర్ రిజ్వీ (41), కేఎల్ రాహుల్ (37) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ పేసర్ ఎషాన్ మలింగ తన పదునైన బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. కీలకమైన డేవిడ్ మిల్లర్ (0), ట్రిస్టన్ స్టబ్స్ (27) సహా మొత్తం 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. మరోవైపు, యువ స్పిన్నర్ హర్ష్ దూబే తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు. కేవలం 2 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ ఓటమిని ఖాయం చేశాడు. దీంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులకే పరిమితమైంది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 7 మ్యాచ్‌లలో 4 విజయాలు, 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడం ఆరెంజ్ ఆర్మీ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776